క్లుప్తంగా

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ


వాడపాలెంల్లో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మండల మాలధారణ పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యుడు పెదపూడి త్రిమూర్తి శ్రీనివాస్, పోసిన వెంకటాచలంతేజ ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు దొంతికుర్తి రామచంద్రశర్మ పర్యవేక్షణలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, గణపతి హోమం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి శ్రీనివాస్, తేజ, అయ్యప్పమాలధారులతో కేరళ వాస్తవ్యులు మధు నంబూద్రి గురుస్వామి 18 మెట్ల పూజతో పడిపూజను వైభవంగా నిర్వహించారు. అనంతరం రాజేష్ గురుస్వామి అయ్యప్ప సంకీర్తన విశేషంగా అలరించింది. వాడపాలెం, కొత్తపేట పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో మాలధారులు, భక్తులు ఈ మహాపడిపూజలో పాల్గొన్నారు. పలువురు భక్తులు, యువకులు వలంటరీ సేవలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలో ఊబలంక, రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారన్నారు. ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, రావులపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం ఫీడర్ పరిధిలోని క్రాప, క్రాప చింతలపూడి, కె.జగన్నాథపురం, పోతుకుర్రు గ్రామాలకు శుక్రవారం ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 11కేవీ లైన్‌కు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మల కత్తిరింపు పనులు చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయాలి

మలికిపురం: ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలని ఏఐఎస్ఎఫ్, విద్యా సంస్థల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం మలికిపురంలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. దాతల సహకారంతో 1948లో ఏర్పాటు చేసిన ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను ఇటీవల ప్రభుత్వంలో విలీనం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విద్యాసంస్థలకు సంబంధం లేని కొంతమంది స్వార్థపరులు హైకోర్టుకు వెళ్లి స్టేటస్కో తెచ్చారని నిరసనకారులు తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు అతి తక్కువ ఫీజులతో చదవాలనే దాతల ఆశయాలను నీరుగార్చడానికి జరుగుతున్న ప్రయత్నాలకు నిరసనగా ఆందోళన చేస్తున్నట్లు వారు తెలిపారు. మలికిపురం డిగ్రీ కాలేజీ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి గాంధీ బొమ్మల సెంటర్లో మానవహారం నిర్వహించారు. డిగ్రీ కళాశాలకు విచ్చేసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకి కూడా తమ గోడును విద్యార్థులు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థల పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు


చెముడులంకలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సర్పంచ్ తమ్మన తదితరులు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో గురువారం గర్భిణులకు సీమంతాలు జరిగాయి. పార్టీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు బోయిడి రమేష్‌నాయుడు, సత్యదుర్గ దంపతులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది గర్భిణులు పాల్గొన్నారు. వారందరికి నూతన వస్త్రాలు, పూలు, పండ్లు అందజేసి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే గర్భిణులకు, బాలింతలకు విశేష సేవలందిస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు చీరలను పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తమ్మన సుబ్బలక్ష్మి, అడబాల వీర్రాజు, బుద్దిగ వీర వెంకటరావు, దొండపాటి చంటి, మోటూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట శిబిరంలో వైద్య సేవలు పరిశీలిస్తున్న అముడా చైర్మన్ దేవిడ్‌రాజు తదితరులు


శృంగవరప్పాడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధురాలికి కళ్లజోడు ఇస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి


పి.గన్నవరం మండలం వై.కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


గోగన్నమఠంలో ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి హుస్సేన్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం ధ్యేయం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- జోరుగా ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు


తొండవరంలో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యాంధ్రప్రదేశ్ ధ్యేయంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. తొండవరంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ రూ.వేల కోట్లతో వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ కంటి వెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వెన్నపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో చింతలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సందర్శించారు. అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యులు బి.మంగాదేవి ఆధ్వర్యంలో 619 మందికి వైద్య సేవలందించారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్యా, వెలువలపల్లి సర్పంచ్ బొంతు మణి, ఎంపీటీసీ చల్లాబత్తుల సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలందిస్తోందని జెడ్పీటీసీ కారెడ్డి అంజిబాబు పేర్కొన్నారు. గోగన్నమఠంలో ఏర్పాటు చేసిన సురక్ష క్యాంప్‌ను గురువారం జెడ్పీటీసీ ప్రారంభించారు. సర్పంచ్ అల్లు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంజిబాబు మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు భూపతిరాజు లక్ష్మి, భూపతిరాజు సత్తిబాబురాజు, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక సచివాలయం-1 పరిధిలో ప్రజలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అముడా చైర్మన్ దేవిడ్‌రాజు ప్రారంభించారు. చైర్మన్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఏ విధమైన అనారోగ్య సమస్యలు ఉన్నా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, పాఠశాల పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, యువజన విభాగం సభ్యుడు బెజవాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక గ్రామ సచివాలయం-2 పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ కోటిపల్లి రత్నమాల అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు గుబ్బల మనోహర్, బందారు కాశీ, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో ఎంపీడీవో జి.భీమారావు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు సందర్శించారు. సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి అధ్యక్షతన ఏర్పాటైన ఈ శిబిరంలో రోగులకు వైద్య సిబ్బంది అందజేస్తున్న సేవలను ఎంపీపీ పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను కూడా ఆయన పరిశీలించారు. శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులకు కళ్లజోళ్లు, ఆరోగ్య సురక్ష కిట్‌ను సర్పంచ్ అందజేశారు. తహసీల్దార్ వై.రామకుమారి, గ్రామ పార్టీ అధ్యక్షురాలు పెదపాటి నాగలక్ష్మి పాల్గొన్నారు.

పి.గన్నవరం: మండలంలోని వై.కొత్తపల్లిలో సర్పంచ్ తోరం వీవీ సత్యనారాయణ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ భారతి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోలేటి బంగారు నాయుడు, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నాయకులు పుచ్చకాయల ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని పెనికేరు-2 గ్రామ సచివాలయం పరిధిలోని కలవచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష జరిగింది. జిల్లాలో ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని 247 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. రోగ తీవ్రత ఉన్న వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి కిమ్స్ ఆస్పత్రికి సిఫారసు చేశారు. సర్పంచ్ వడ్డి వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు కె.ఎల్.సత్యనారాయణ, ఎంపీటీసీ వై.స్వాతి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, గ్రామ కార్యదర్శి వి.వేణి, పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

అమర జవాన్ల త్యాగాలను స్మరించుకోవాలి


మలికిపురంలో నా మట్టి నా దేశం ర్యాలీలో మట్టి నమూనాలతో ఎమ్మెల్యే రాపాక తదితరులు

మలికిపురం: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీర జవానులను, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం కోనసీమ జిల్లా ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా దేశం నా మట్టి కార్యక్రమాన్ని గురువారం మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టీవీవీ సతీష్ అధ్యక్షతన సమావేశం, కలశ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాపాక పాల్గొని భారతమాత, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటానికి పూలమాలలు అర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం వివిధ మతాలకు, కులాలకు పుట్టినిల్లని దేశ సమగ్రతను, సౌభ్రాతృత్వాన్ని కాపాడవలసిన బాధ్యత నేటి యువతపై ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, జాన శంకరరావు, తులసి భాస్కర్, మాలే శ్రీనివాస్‌నగేష్, కళాశాల అధ్యాపకులు కేవీహెచ్ విజయకుమార్, రమేష్ బాబు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్‌కు బాటలు


శివకోడులో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావితరాలకు భవిష్యత్ బాటలు వేశారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శివకోడులో గత 10 రోజులుగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఆయన తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ని మళ్లీ విజయపథంలో నిలపాలన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. విద్యార్థులకు నూతన సిలబస్ విధానం, ట్యాబ్‌లు, ఇంగ్లిష్ మీడియం వంటి అనేక మార్పులు తీసుకుని వచ్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్పు చేశారన్నారు. సర్పంచ్ నక్కా రామారావు, జెడ్పీటీసీ మట్టా శైలజ, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మట్టా ఏడుకొండలు, గెద్దాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మామిడికుదురు: వైద్య పరంగా ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం పి.గన్నవరం మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.6.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను చిట్టిబాబు లబ్ధిదారులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా నయం కాని వ్యాధులకు చికిత్స చేయించుకునే వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిట్టిబాబు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులపర్తి రాజారావు, సర్పంచ్‌లు వడలి కొండయ్య, దంగేటి అన్నవరం, పార్టీ నేతలు దొమ్మేటి దుర్గారావు, యన్నాబత్తుల ఆనంద్, పితాని నర్సింహారావు, యల్లమెల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, కారుపల్లి శ్రీను, మంగం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జిగా సూర్యారావు



అంబాజీపేట: అంకితభావంతో పార్టీ బలోపేతం, విస్తరణ కోసం అహర్నిశలు పాటుపడిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొల్లి సూర్యారావు (సుధాకర్) ఉత్తరాంధ్ర బీజేపీ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్ నుంచి లిఖిత పూర్వక ఉత్తర్వులు అందుకున్నారు. సూర్యారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా నియమించటం తన అదృష్టమన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర నాయకులకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హోమియో వైద్యుడు, చర్మవ్యాధుల నిపుణుడు, దంత వైద్య సేవలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు.

గడపగడపకూ నిధులతో అభివృద్ధి పనులు


పెదపట్నంలంకలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నంలంకలో గడప గడపకు నిధులు రూ.40 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లిన సందర్భంగా ప్రజల నుంచి పలు విజ్ఞాపనలు వచ్చాయన్నారు. గడప గడపకు నిధులతో ఈ సమస్యలను పరిష్కరించామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని 75 గ్రామ సచివాలయాలల్లో అభివృద్ధి పనులకు గడప గడపకు ద్వారా రూ.15 కోట్లు నిధులు మంజూరయ్యాయని చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి చిన్ని, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు రాయుడు జనార్దన్, కొమ్ముల సూరిబాబు, జోగి రామకృష్ణ, విప్పర్తి నాగేశ్వరరావు, యల్లమెల్లి ఏడుకొండలు, వేగి రాంబాబు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ప్రతి వ్యక్తి నా దేశం-నా మట్టి భావన కలిగి ఉండాలని రాష్ట్ర బీజేపీ యువమోర్చ కార్యవర్గ సభ్యురాలు కాలాబత్తుల చిన్నారి అన్నారు. గురువారం ఆత్రేయపురంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువజన కేంద్రం కాకినాడ ఆధ్వర్యంలో నామట్టి-నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ నాతిబుజ్జి, ఎస్సై కిరణ్‌కుమార్, డీటీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటికను నిర్మించడానికి దేశంలోని ప్రతి గ్రామం నుంచి పవిత్ర మట్టి సేకరణకు ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారన్నారు. ఆత్రేయపురం మండలంలోని ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీకి పంపుతామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

దాతల సహకారం అభినందనీయం


స్థల దాతలకు సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, గ్రామపెద్దలు

ఆత్రేయపురం: గ్రామ సచివాలయ నిర్మాణానికి స్థలం అందించిన దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. గురువారం మండలంలోని ఉచ్చిలిలో రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ సచివాలయానికి అవసరమైన రూ.లక్షల విలువైన స్థలాన్ని పంచాయతీకి ఉచితంగా ఇచ్చిన స్థల దాతలు నంబూరి రామరాజు, సత్యనారాయణరాజు, రవిరాజు సుబ్బరాజు, రామరాజులను ఎమ్మెల్యే, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేందుకు సచివాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలందరికీ అవసరమైన సేవలన్నీ ప్రభుత్వం గ్రామస్థాయిలో అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, సర్పంచ్ ఉర్రింకల మీరమ్మ, నంబూరి పద్మరాజు, ఇందుకూరి కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగారాజు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, ఎంపీడీఓ నాతిబుజ్జి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం


ఉచ్చిలిలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన గురువారం ఉచ్చిలి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వం ఎలాంటి రికమెండేషన్లు లేకుండా అర్హతే ఉంటే చాలు అన్ని పథకాలు అందిస్తుందన్నారు. నంబూరి పద్మరాజు, ఇందుకూరి కృష్ణంరాజు, ఉర్రింకల మీరమ్మ, త్రిమూర్తులు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పతకాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, చిలువూరి బాబిరాజు, కొల్లి శ్యాంసన్, తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుతో ఆక్రమణ తొలగింపు


బాబానగర్‌లో ఆక్రమణ తొలగించిన స్థలంలో నిర్మించిన రోడ్డు

మామిడికుదురు: పెదపట్నం బాబానగర్ కాలనీలో సర్వే నంబర్ 171-1లో ప్రభుత్వం గతంలో 59 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. అప్పట్లోనే అవుట్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణానికి కూడా స్థలం కేటాయించారు. పంచాయతీ నిధులతో రెండు రోడ్లు నిర్మించారు. మరో రోడ్డు నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేశారు. కానీ ఆ రోడ్డుకు సంబంధించిన స్థలం ఆక్రమణకు గురి కావడంతో స్థానికులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా అధికారులు చర్యలకు ఆదేశించారు. ఎమ్మార్వో రియాజ్ హుస్సేన్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసుల సహకారంతో ఆక్రమించిన స్థలానికి మోక్షం కలిగించారు. అక్కడ ఏర్పాటు చేసిన కంచెను తొలగించడంతో రోడ్డు నిర్మించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎంతో కాలం నుంచి పరిష్కారం కాని ఆక్రమణ సమస్య స్పందన ద్వారా పరిష్కారమైందని ఆనందం వ్యక్తం చేశారు.

సచివాలయ వ్యవస్థతో పరిపాలనా సౌలభ్యం

రాజోలు: సచివాలయ వ్యవస్థతో పరిపాలన సౌలభ్యంగా జరుగుతుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం శివకోడులో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. తొలత ఎమ్మెల్యే రాపాకను సర్పంచ్ నక్కా రామారావు ఆధ్వర్యంలో గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాపాక సచివాలయ భవనాన్ని ప్రారంభించగా, ఆయన తనయుడు వెంకట్‌రామ్ సచివాలయ ఉద్యోగులకు కేటాయించిన గదులను ప్రారంభించారు. సర్పంచ్ రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాలకు వెళ్లనవసరం లేకుండా గ్రామంలోనే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండే విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందజేశారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలి

అంబాజీపేట: ఈనెల 29న నిర్వహించే విజయ భేతాళ స్వామి ఉత్సాన్ని యువకులు, పెద్దలు పండగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఐ డి.ప్రశాంత్‌కుమార్ సూచించారు. అంబాజీపేట కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో 13 పాలాల వాహన నిర్వాహకులతో ఎస్సై ఎ.చైతన్య కుమార్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 13 వాహనాలకు సంబంధించి ఎక్కడ ఎటువంటి హీరోలు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉన్నా వెంటనే తొలగించాలన్నారు. అలాగే ఉత్సవాల్లో అశీల నృత్యాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. పోలీస్ సిబ్బందికి ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. ప్రతీ వాహన వద్ద, సినీ ఆర్కెస్ట్రాల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వాహనాల వద్ద కమిటీ సభ్యులు ఎటువంటి ఘర్షనలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న వాహనాల ఊరేగింపు ఆనవాయితీ ప్రకారం నిర్వహించుకుని ప్రశాంతంగా తీసుకెళ్లేందుకు వాహనాల నిర్వాహకులు, ప్రజలు సహకరించాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, అంబాజీపేట, మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి రామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం మోహనరావు 13 పాలాల సంఘ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు


గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న ఏనుగులమహల్ గ్రామ పెద్దలు

కొత్తపేట/రావులపాలెం: నియోజకవర్గంలో 44 దేవాలయాల అభివృద్ధికి తిరుమల-తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ నుంచి నిధులు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట శివారు ఏనుగులమహల్‌లో రామాలయం అభివృద్ధి విషయాన్ని ఇటీవల ఆ గ్రామ పెద్దలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి దేవదాయ శాఖ అధికారుల ద్వారా టీటీడీకి ప్రతిపాదనలు పంపించారు. తద్వారా నిధులు మంజూరుకు కృషి చేశారు. ఆ మేరకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆ గ్రామపెద్దలు గురువారం సాయంత్రం రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువా వేసి సత్కరించారు. కార్యక్రమంలో మందపల్లి వైస్ ప్రెసిడెంట్ గ్రంధి చంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సిద్ధంశెట్టి తాతాలు, సిద్ధంశెట్టి శంకర్, మెడిద రవి, తాడి సత్యనారాయణ, లంక సుబ్బారావు, అడపా దొరబాబు, కుంపట్ల చిన్న, కుంపట్ల వెంకటేశ్వరరావు, కొమ్ముల శివాని, మోటూరి భూషణం తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అయినవిల్లి: దసరా పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను మండలంలోని నేదునూరు, వీరవల్లిపాలెం, నల్లచెరువు, ఎన్.పెదపాలెం, ఎస్.చిన్నపాలెం తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక రాజమండ్రి కమిటీ సభ్యులు శేఖర్‌బాబు, జగన్, జయరాం, సత్యనారాయణ, రామాంజనేయులు, సత్యవతి, సరిత, దేవి, శాంతి, స్వాతి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.